
శ్రీ చక్రధారి శతకము



రచయిత్రి

## చొప్పకట్ల హరిణి శ్రీధర్

https://harini.choppakatla.com

harini.choppakatla@gmail.com

# శ్రీ చక్రధారి శతకము

1. శ్రీకరమ్ము గోరి చిత్తశుద్ధిగ బూని
అక్షరార్చనమ్ము నక్షయముగ
దివ్యరీతి సలుప దేహి యనగ గావు
జయము నిగమ నిలయ చక్రధారి!!

2. శ్వాశ ధ్యాసలన్ని చక్కనౌ రీతిని
నిలిపి నీ పదముల నియతి మీఱ
నీ చరితము వ్రాయ నిన్ను వేడ గనుమ
జయము జయము నీకు చక్రధారి!!

3. కృష్ణుడైన రామ కృపయైన నీవెగా
కలియుగమున గాచు కల్కివీవు
నరుల నాథుడైన నారసింహుడు నీవు
జయము జయము నీకు చక్రధారి!!

4. అష్టమితిథి నందు నద్భుత రీతిని
దేవకీ సుతునిగ దేవ నీవు
జగతి యందు వెలసి జనుల బ్రోచితివయ్య
జయము జయము నీకు చక్రధారి!!

5. శ్రితజన పరిపోష శ్రీరుక్మిణీ పతీ
వరదహస్త పరమ వాసుదేవ
భాగ్యములనొసంగు బలభద్ర సోదరా
జయము జయము నీకు చక్రధారి!!

6. తల్లిదండ్రులైన దరినిల్చు సఖుడైన
గురువు దైవమైన కూర్మియైన
భాగ్య భోగ్యమైన పరమాత్మ నీవెరా
జయము జయము నీకు చక్రధారి!!

7. ధర్మమంతమొంది ధరణిజ మిక్కిలౌ
పాపభారము గొని వగపుజెంద
దైత్యహరము సలిపి ధరణి తేజము నిల్పు
జయము జయము నీకు చక్రధారి!!

8. నంద నందన హరి నవనీతచోరుడా
నందకుల మురారి నల్లనయ్య
బాధలన్ని దీర్చు రాధాహృదయవాస
జయము జయము నీకు చక్రధారి!!

9. కృష్ణ కృష్ణ యనుచు తృష్ణదీరగ దల్చి
నీ పథమున నిలచి నిష్ఠతోడ
నిన్ను గొలువ సతము నీరజాక్ష గనుమ
జయము జయము నీకు చక్రధారి!!

10. మాయవన్నెలు గొని మథురానగరి యందు
చిన్ని కృష్ణ నీవు చిందులేసి
కంసవధను సలిపి కైవల్య మొసగిన
జయము జయము నీకు చక్రధారి!!

11. వాసుదేవ చక్రి వైరిహరణ శూరి
వజ్రవల్లభ హరి వ్రజకిశోర
కువలయేశ సూరి కులపతీ పాహిమాం
జయము జయము నీకు చక్రధారి!!

12. మెరుగు చేలములను మెరుగుగా ధరియించి
పేర్మితో శిరమున పింఛమున్న
చేతిని మురళి గొని చిన్నికృష్ణా రార
జయము జయము నీకు చక్రధారి!!

13. కోర్కె మీఱ సతము గోపజనులు బూని
నిన్ను కొలిచిరి కడు నిష్ఠతోడ
నిన్ను మించునట్టి నెలవులేదని దల్చి
జయము జయము నీకు చక్రధారి!!

14. పూరిపురమునందు పుణ్యమూర్తిగ నీవు
సహజ సహజుని దరి చక్కని గతి
వెలుగులిడుచు నిలచి వెతలుదీర్చుచు గాచు
జయము నిగమ నిలయ చక్రధారి!!

15. ముగ్ధమోహనమగు స్నిగ్ధవదన కృష్ణ
వేణుగానలోల వేదరూప
యాశ్రిత జనపోష యచ్యుతా కేశవా
జయము నిగమ నిలయ చక్రధారి!!

16. అరమరలను వీడి యచ్యుతుడవగు నీ
పదములందు నిలువ పరవశమున
సతము కీర్తనమును శ్రవణమ్ము సలిపెద
జయము నిగమ నిలయ చక్రధారి!!

17. గురుని పదములందు కూర్మితోడను నిల్చి
విద్యనభ్యసించి వినయముగను
నిన్ను గొలుచు విధుల నేర్తు నిష్ఠగ దేవ
జయము నిగమ నిలయ చక్రధారి!!

18. జయ జయ జయ గోపజన మానసవిహారి
జయ జయ  విమల సత్యరూప
జయ విజయుల పాల జగదీశ మాధవా
జయము నిగమ నిలయ చక్రధారి!!

19. రమ్యచరిత దేవ రాధా మదినివాస
సత్యభామ నాథ సత్కళ హరి
కంసహారి శౌరి కైవల్యపద దాత
జయము నిగమనిలయ చక్రధారి!!

20. పాలు వెన్న మధుర పాలమస్తువు గొని
పేర్మితోడ నీకు ప్రియముగ నిడి
తృప్తి జెందెదనయ దేవకీ నందనా
జయము నిగమనిలయ చక్రధారి!!
( మస్తువు: మీగడ)

(నామ మహిమ)

21. రామ రామ యనుచు రామనామము వ్రాసి
కృష్ణ యని పలికెద తృష్ణదీర
హరిహరి యని సతము హాయిగా సేవింతు
జయము నిగమనిలయ చక్రధారి!!

22. పాపనాశకమ్ము పావన నామమ్ము
తాపవారకమ్ము తారకమ్ము
రక్షనొసగు నీదు రమ్యమౌ నామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

23. తేటతెనుగువోలె తీపి నీ నామమ్ము
సత్యవీంద్రుల మది స్థైర్యమిదియె
నిష్ఠతోడ తలువ నిధి నీదు నామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

24. సంకటహరణమ్ము సకలవిఘ్న హరము
కల్మష హరణమ్ము కామితముల
సిద్ధి నొసగు నీదు సిద్ధనామము కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

25. భవహరమ్ము దివ్య భాగ్యప్రదాయిని
కలియుగమ్మునందు కల్పవల్లి
కలిపురుషుని మాయ ఖండించు నామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

26. వానరమగు మదిని భక్తిమార్గము నందు
సంతతమ్ము నిలిపి శక్తినిడుచు
మోక్షమొసగు నీదు మోహననామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

27. నరుల సురులనెల్ల నావయై నడిపించి
పరమపథమునొసగు పావననిధి
విశ్వమంతనడరు వేదమౌనామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

28. నందముగ సతమ్ము నారదుండు పలుకు
మధుర కీర్తనముల మధువు నీవె
నీదు స్మరణకైన మోదమ్ము లేదయ్య
జయము నిగమనిలయ చక్రధారి!!

29. మదిని హాయి గొలుపు మధువు నీ నామమ్ము
చిత్తశుద్ధి నొసగు చేతనమది
వీనుల ఘన విందు విమలమౌ నామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

30. మిక్కిలౌ ప్రియముగ మీర దలచినట్టి
స్థైర్య ధైర్యమొసగు సత్యమిదియె
ధన్యతనిడి నడుపు ధన్యమౌ నామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

31. సుజనతతులకెల్ల శుభములనొసగుచు
మునివరులకు పరమముక్తినిడుచు
గాచును హరి నీదు గరిమలనామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

32. కష్ట నష్టమందు కలిమినొసంగుచు
కార్యసిద్ధులనిడు కల్పవల్లి
భవమును హరియించు భవ్యమౌ నామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

33. హాయి మీఋనటుల హరిదాసులు పలుకు
మధురకీర్తనముల మాన్యమిదియె
భుక్తి ముక్తినొసగు పుణ్యమౌనామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

34. భక్తజనులు సలుపు పరమభజనలందు
మదిని మాయజేసి మరులుగొలుపు
తేజమౌ లలితము దేవ నీ నామమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

35. నామజపము చేత నందమునొందుచున్
భక్తదాసుడ వయి ప్రతిదినమ్ము
రక్షనిడుచు నడుపు రాజీవలోచనా
జయము నిగమనిలయ చక్రధారి!!

36. భావనమ్ముతోడ పరమతుష్టినిజెందు
భక్తసులభ పరమశక్తిరూప
వందనములు నీకు వాసుదేవా హరీ
జయము నిగమనిలయ చక్రధారి!!

37. కాలియందియలిల గలగలా సవ్వడిన్
జేయ రార దేవ చిన్నికృష్ణ
మదిని కోర్కె దీర్చ మాధవా రావయ్య
జయము నిగమనిలయ చక్రధారి!!

38. రంగు రంగుల కడు రమ్యమౌరీతినిన్
మంటపమును దీర్చి మమతమీఱ
పూజలన్ని సలుప పుణ్యమూర్తి గొనుమ
జయము నిగమనిలయ చక్రధారి!!

39. క్షణికమౌ బ్రతుకున క్షణమైన నీపైన
తలపు నిలుపు విధము తగినరీతి
బోధ జేసి మదికి బుద్ధినిడుమ కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

40. భావమాలలు గొని పరవశమ్మున నేను
నీ పదముల నిలుప నియతి మీఱ
వెడలగ నను గనుమ విశ్వంభరా కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

41. ప్రతిదినమ్ము సలుపు ప్రతికార్యమున నిన్ను
నిలిపినడచు నట్టి నిరతినిమ్ము
ప్రతితలపున నిలుపు పరమభాగ్యమిడుమ
జయము నిగమనిలయ చక్రధారి!!

42. పరమభాగవతుల పరమయోగ వినుత
విమలచరిత పరమవేదవేద్య
సత్యపథమునందు సతతము నిలుపుమా
జయము నిగమనిలయ చక్రధారి!!

43. ఆరురిపువులెల్ల గారెడి జేయుచున్
అణచివేయ నన్ను నదుపులేక
నిగ్రహమ్మునిడుచు నీభక్తి నొసగుమా
జయము నిగమనిలయ చక్రధారి!!

44. శ్రీనివాస శ్రీశ శ్రీకరా శ్రీధరా
మాన్యతేజ లలిత మధురవాస
దీనబాంధవ హరి దేవకీ నందనా
జయము నిగమనిలయ చక్రధారి!!

45. కల్లకపటములను కలిమాయ ఛాయలన్
తగని మర్మబుద్ధి దర్పములను
దొలగజేయుమయ్య దుష్టసంహారివై
జయము నిగమనిలయ చక్రధారి!!

46. తల్లిదండ్రులనిన దైవరూపులనెడి
సత్యమును దెలుపుమ జనులకెల్ల
వారి సేవ యనిన పరమసేవని దెల్పు
జయము నిగమనిలయ చక్రధారి!!

47. సత్పకులను వీడి సత్సంగమును వీడి
జపతపముల వీడి జగతియందు
సంచరించు జనుల సత్పథమున నిల్పు
జయము నిగమనిలయ చక్రధారి!!

48. నగధరుండ! శౌరి! నాపాలిదైవమా
గిరిధరుండ కృష్ణ క్లేశనాశ
ధర్మపథమున నను తప్పక నిలుపుమా
జయము నిగమనిలయ చక్రధారి!!

49. శతకమందున నిను శతవిధముల గొల్వ
యత్నమింప నన్ను నాదరించి
తగిన సాయమిడుమ దామోదరా హరీ
జయము నిగమనిలయ చక్రధారి!!

50. జన్మతిథిని నిన్ను చక్కనౌరీతిని
గృహమునందు నిలిపి కూర్మితోడ
కోర్కె మీఱ గొలుతు గోధూళి సమయాన
జయము నిగమనిలయ చక్రధారి!!

51. భక్ష్య భోజ్యములను పరమపావన రీతి
భక్తితోడ జేసి శక్తి కొలది
ఘన నివేదనమిడ కరుణ జూపుమ కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

52. సతతము నిను దలచి సర్వమ్ము నీవంచు
సకల జీవులందు సత్వమనుచు
జగము నడుపునట్టి సత్వమ్ముగా గొల్తు
జయము నిగమనిలయ చక్రధారి!!

53. వామన నరసింహ వసుదేవ నందనా
కేశవ నరనాథ క్లేశనాశ
గిరిధరుడ నగధర హరి! సహస్రాననా!
జయము నిగమనిలయ చక్రధారి!!

54. దరిని జేరుమయ్య ద్వారకానాయకా
భక్తవత్సలుండ భద్రరూప!
ద్రౌపది పరిపోష దారిద్ర్యనాశకా
జయము నిగమనిలయ చక్రధారి!!

55. తనువునున్న సకల తపనలన్ని మరచి
నీదు సేవజేయ నియతి మీఱ
పరవశమున నిల్తు ప్రతిదినమున నేను
జయము నిగమనిలయ చక్రధారి!!

56. ప్రణవరూప సత్య పరమాత్మ నీవని
నమ్మి కొలువ నిన్ను నయమగు గతి
సత్యపాలనమ్ము సలుపనిమ్ము తండ్రి
జయము నిగమనిలయ చక్రధారి!!

57. ముజ్జగములనేలు మువ్వగోపాలుడా
రాధికేశ దివ్య రమ్యరూప
వినతి సేయ సతము విజయమునిడుమయ్య
జయము నిగమనిలయ చక్రధారి!!

58. వేదవేద్య దివ్య బృందావనవిహారి
రుక్మిణీశ సకల రుగ్మతలను
బాపుమయ్య దేవ పరమయోగవినుత
జయము నిగమనిలయ చక్రధారి!!

59. ఊయలందు నడరు సోయగముల కృష్ణ
నందవంశతిలక నల్లనయ్య
గోపభామలెల్ల కొలుచు దేవా హరీ
జయము నిగమనిలయ చక్రధారి!!

60. హరి హరి యని దలువ హరియించు పాపముల్
హరి హరి యని దలువ హాయినిడును
హరి హరి యను నాత్మ హాయిగా నినుజేరు
జయము నిగమనిలయ చక్రధారి!!

61. ఆత్మ/వోలె /నడరు/ అక్రూరవరదుడా
ఖడ్గపాణి శౌరి కలివినాశ
కరుణను నను గనుమ కైవల్యవరదాత
జయము నిగమనిలయ చక్రధారి!!

62. సకల భువనములను సంశయములు లేక
యుదరమందు నిలుపు యోగివైన
దేవకీ సుతుడగుచు తేజరిల్లిన దేవ
జయము నిగమనిలయ చక్రధారి!!

63. చిక్కులెన్నొ బెట్టి చిక్కనిధీరుడై
వెన్న దొంగలించి వెతనుగూర్చి
మాయజేసి జనుల మదినిదోచిన కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

64. సత్కవీంద్రుల ఘన సాత్విక స్ఫూర్తివై
భావసిరుల నొసగు పరమపురుష
పరవశమున వ్రాయు పద్యమై వెలుగుమా
జయము నిగమనిలయ చక్రధారి!!

65. చలనమన్నది విడి చరవాణి జేబట్టి
కాలమైన గనక కనులవిందు
సతము జేయునట్టి జనుల బుద్ధినిడుమ
జయము నిగమనిలయ చక్రధారి!!

66. పద్యకవులమనుచు పయనమై సతతమ్ము
ప్రభువు మదిని నిలువ పరమగు నిను
మరచి సంచరించు మనుజుల బ్రోవుమా
జయము నిగమనిలయ చక్రధారి!!

67. కరము బట్టి నడుపు కర్త నీవే కదా
స్ఫూర్తి నీవు మదిని శోభ నీవు
కర్త, కర్మ, క్రియల కాణాచివే నీవు
జయము నిగమనిలయ చక్రధారి!!

68. చిరునగవుల తోడ చిన్నికృష్ణుడవయ్యి
ముద్దులొలుకుచు కడు మోహనముగ
చింతదీర్చ రార చెన్న కేశవ దేవ
జయము నిగమనిలయ చక్రధారి!!

69. నలుగు బెట్టి నీకు నయముగా నిత్యమ్ము
స్నయము సలిపెదనయ సాంత్వనిడుచు
లాలి పాడెదనయ లీలా వినోదినీ
జయము నిగమనిలయ చక్రధారి!!

70. ఊరు వాడలన్ని నోరార నిను దల్చి
కృష్ణ కృష్ణ పాహి కృపను జూపు
మనుచు వేడ దేవ యార్తులన్ దీర్చుమా
జయము నిగమనిలయ చక్రధారి!!

71. పద్యకవిగ నిలచు పటిమనొసంగుమా
ఛందసారమిడుచు చక్కని గతి
వివిధ ఛందములలొ విరివిగా స్తుతియింతు
జయము నిగమనిలయ చక్రధారి!!

72. నిన్ను గను క్షణమున నేనన్ని మరచుచు
లీనమగుదు నీదు లీలలోన
బంధములను మరచి భక్తితో నిను గొల్తు
జయము నిగమనిలయ చక్రధారి!!

73. భవమునందు నిలిపి బంధనమ్ముల నిడి
బాధ్యతల నడుమను భారమైన
బ్రతుకునెటుల కొలుతు భక్తితో నినుసామి
జయము నిగమనిలయ చక్రధారి!!

74. శోఖములను దీర్చ నేకాదశీ తిథి
వ్రతము నాచరింప పావనముగ
కామ్యములను దీర్చి కైవల్యమొసగును
జయము నిగమనిలయ చక్రధారి!!

75. బక, అఘాసురులను బాగుగా దండించి
వదను సలిపి జనుల వగపుదీర్చి
తేజరిల్లినట్టి దివ్య దేహా నమో
జయము నిగమనిలయ చక్రధారి!!

76. నిన్ను దలచినంత నీరసించిన మది
సేద దేరి నూత్న చేతనమున
పరమపథమునందు పరుగులిడును కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

77. ఆప్తమిత్రుడైన నాత్మ బంధువులైన
మదినెరిగిన సఖుల మమతలైన
సర్వమిలను నాకు సర్వేశ నీవయ్య
జయము నిగమనిలయ చక్రధారి!!

78. చందనమును దివ్య చంపకమ్ముల గొని
నీపదయుగళముకు నియతి మీఱ
నిత్య సేవ జేసి నీదాసినయ్యేద
జయము నిగమనిలయ చక్రధారి!!

79. సురుచిర హసిత విధుశోభిత మోహనా
మానసము హరించు మాగిరిధర
యభయ మొసగుమయ్య యచ్యుతా కేశవా
జయము నిగమనిలయ చక్రధారి!!

80. (ఛప్పన్ భోగ్)
చక్కనైన రీతి ఛప్పను భోగముల్
కూర్మితోడ జేసి కోర్కెమీఱ
ఆరగింపునిడగ యందుకొనుమ కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

81. సకల శుభములనిడు శ్రావణమ్మున నిన్ను
పరివిధముల కొలువ పరవశమున
శ్రీకరమును గూర్చు శ్రీధరా శ్రీకరా
జయము నిగమనిలయ చక్రధారి!!

82. సరస సురస సకల శాస్త్రసారము నీవు
మంత్ర తంత్రమందు మహిమ నీవు
జీవులందు వెలుగు జీవము నీవయ్య
జయము నిగమనిలయ చక్రధారి!!

83. మధురము హసితమ్ము మధురమ్ము వదనమ్ము
మధురము స్మరణము మహితచరిత
మధురము గమనమ్ము మధురమ్ము సకలమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

84. శాస్త్రపఠనములను సలుపగ లేనయ్య
యతుల నియమములను నరయలేదు
పరమకృపను జూప వ్రాసితి శతకమ్ము
జయము నిగమనిలయ చక్రధారి!!

85. తనువునందు నీవు తరగని సత్వమై
నన్ను నడుపుచుండ నయముగాను
సత్కవిత్వపథము చక్కగా నిలచితి
జయము నిగమనిలయ చక్రధారి!!

86. అటుకుల పలుకులను అమృతమౌ ఫలములన్
పిండివంటలనిడ ప్రియముగాను
కరుణను గొనుమయ్య ఘనకుచేలుని సఖా
జయము నిగమనిలయ చక్రధారి!!

87. శ్రావణమ్ము నందు సౌభాగ్యలక్ష్మితో
శౌరి రార విజయ సూరి రార
పూజలందుకొనుచు పొలుపుగా రంజిల్ల
జయము నిగమనిలయ చక్రధారి!!

89. (కృష్ణ కర్ణామృతము)
బిల్వమంగలుండు ప్రీతితో లిఖియించె
నీ మహిత చరితను నెమ్మి మీఱ
కళగ వెలుగులిడుచు కర్ణామృతము నిల్చె
జయము నిగమనిలయ చక్రధారి!!

90. రస్కనుడు లిఖించె రమ్యమౌ గాథలన్
నీ పథమున నిలచి నెనరుతోడ
తన్మయమున కొలచి ధన్యతనొందెను
జయము నిగమనిలయ చక్రధారి!!

(సయ్యద్ ఇబ్రహీం ఖాన్ (1546 - 1628) కలము పేరు రస్కన్, తుష్కరునిగా జన్మించియు కృష్ణుని అనుచరుడయ్యాడు, విఠలనాథుడి నుండి భక్తి మార్గం నేర్చుకున్నాడు మరియు బృందావనంలో నివసించడం ప్రారంభించాడు , అక్కడ అతను తన జీవితాంతం గడిపాడు)

91. నందముగ నిను గన నంబూద్రి యార్తితో
భక్తి శ్లోకములను వ్రాసెను పలు
కోర్కె మీఱ కొలచె గురువాయిరప్పగా
జయము నిగమనిలయ చక్రధారి!!

(పూంతనం నంబూద్రి: మలయాళ సాహిత్యం మరియు భక్తి ఉద్యమంలో గౌరవనీయుడైన వ్యక్తి పూంతనం, శ్రీకృష్ణుని రూపమైన గురువాయురప్పన్ పట్ల ఆయనకున్న లోతైన భక్తికి ప్రసిద్ధి చెందారు. ఆయన కళాఖండం, "జ్ఞానప్పన", దైవికత పట్ల ఆయనకున్న అచంచలమైన ప్రేమ మరియు భక్తిని వ్యక్తపరిచే భక్తి శ్లోకాల సమాహారం.)

92. సత్పథమున జనెడి చైతన్య ప్రభువుగా
భక్తి బోధనలను పావనమగు
నీ చరితను దెలిపి నిన్నుజేరె తుదకు
జయము నిగమనిలయ చక్రధారి!!

చైతన్య మహాప్రభువు (15వ శతాబ్దపు సాధువు మరియు సంఘ సంస్కర్త అయిన చైతన్య మహాప్రభు బెంగాల్‌లో భక్తి ఉద్యమానికి మార్గదర్శకుడిగా పరిగణించబడ్డాడు. )

93. గోవుల బగిది నను గోపాల గావుమా
సత్పథమున నిల్పి సంతతమ్ము
నీదు రక్ష లేక నే నిల్వలేనురా
జయము నిగమనిలయ చక్రధారి!!

94. చిత్త చపలములను చిత్తుజేయుచు నీదు
స్మరణమందు మదిని సంతతమ్ము
నిలుపునటుల జేయు నిరతినిడుమ కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

95. జననమందు లేని ధనము వాహనములు
సిరుల గోరి జనులు వరుసగాను
పరమగు నిను మరచి వగపు జెందెదరయ్య
జయము నిగమనిలయ చక్రధారి!!

96. శుభకరుండ మదన సొబగులతేజమా
శ్రీకరుండ లలిత శ్రీధరుండ
వేదవేద్య భవ్య బృందావనవిహారి
జయము నిగమనిలయ చక్రధారి!!

97. శ్యామలాంగ రంగ సామజత్రాణమా
భక్తపోషక హరి వరదహస్త
నిక్కమౌ తపముల చక్కని శుష్మమా
జయము నిగమనిలయ చక్రధారి!!

98. గిరుల నిలచి నీవు వరలుచు సతతమ్ము
నమ్మతోడను కడు నద్భుతముగ
మమ్ము గాచుచు కలిమాయ బాపుమ కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!

99. మతము కులమనంచు హితమును మరచుచున్
ధర్మపథము వీడి దయనువీడి
తపనతోడ జనులు దైత్యులై జనిరయ్య
జయము నిగమనిలయ చక్రధారి!!

100. పార్థసారథి హరి పాహిమాం రక్షమాం
పాంచజన్య ధారి పాహి పాహి
వరదహస్త దేవ పాహిమాం రక్షమాం
జయము నిగమనిలయ చక్రధారి!!

101. మంగళములు నీకు మంగళతేజమా
మంగళములు నీకు మదనజనక
మంగళములు నీకు మాధవా కేశవా
జయము నిగమనిలయ చక్రధారి!!

102. మంగళములు నీకు మహనీయ గుణనిధీ
మంగళములు నీకు మహిత చరిత
మంగళములు విజయ మంగళములు కృష్ణ
జయము నిగమనిలయ చక్రధారి!!